4. సేవక వరులు విల - సింపఁగఁ జేసి యా = పావనాద్భుతములఁ - బ్రచురముఁ జేయుదు ॥యిది॥

5. దావీదుని వర - తనయుఁడై యభిషే = కావృతుఁడౌ రాజా - గ్రణికి హోసన్నా ॥యిది॥

- పురుషోత్తమ చౌధరి

## 59 *O day of rest and gladness*

1. సుక్షేమ శుభకాల
విశ్రాంతి దినమా
విచారమెల్ల తీర్చు
దైవాదివారమా
ఈనాడు మేము కూడి
దేవాలయంబున
మా త్రైక దేవ స్తుతిఁ
గావింతు మెంతయు.

2. నీయందు సృష్టికర్త
విశ్రామ మొందెను
నీయందు యేసుక్రీస్తు
మృత్యు బంధమును
త్రెంచుచు తాను లేచి
చావుఁ జయించెను
నీ యందు పావనాత్మ
మాకియ్యఁ బడెను.

3. భూవాసు లీ దినంబు
సంతోషపడుచు
సువార్త విని, పాడి
మా యేసు స్తోత్రము
పితృపుత్ర శుద్ధాత్మ
త్రిత్వంబౌ దేవుని
ఉత్సాహ ధ్వనితోడ
నెంతో స్తుతింతురు.

- క్రిస్టఫర్ వర్డ్స్‌వర్త్
అను: జేకబ్ చేంబర్లేన్

# తండ్రియగు దేవుడు

## 60 నీవు నా తండ్రివి

రా - ఆనందభైరవి తా - ఆది

గొప్ప దేవ నాకు తండ్రివి - యాకాశమందు - గొప్ప దేవ నాకుఁ దండ్రివి = తప్పకుండ వత్తు నీ - దరికి యేసు నామమందు - గొప్ప కరుణ చేత న - న్నిప్పుడు తగఁ జేర్చుకొనుము ॥గొప్ప॥

1. నీవు మిగుల గొప్ప వాఁడవు - నా సృష్టి కర్త - యీవు లెపుడు నిచ్చు వాఁడవు = భావమందు నినుఁ దలంచి - పావనాత్మ నాకు నిచ్చి - జీవమార్గమందు నిలిపి - కావు మనుచు వేఁడుకొందు ॥గొప్ప॥

2. చిన్నవాని నంగి ప్రార్థన - నీ లోకమందు - మున్ను దయను విన్న వాఁడవు = సన్నుతుఁడగు యేసు నీదు - సన్నిధి నున్నాఁడు గాన - నన్నుఁ గనికరించు మనుచు - నిన్ను నమ్మి వత్తు నిపుడు ॥గొప్ప॥

3. విలువ గల్గు నీదు నాజ్ఞలు - నా హృదయమందు - బలు విధములఁ దలఁచు చుందును = బలుకులందుఁబనులయందు - బలముఁ జూపి నిన్నుఁ గొలిచి - యిలను నిన్నుఁ బ్రీతిపరుతు - నలయక నీ కరుణ మెయిని ॥గొప్ప॥

4. మీఁది రాజ్యమందుఁ జేర్చుము - కరుణాసముద్ర - బీద నైన నన్నుఁ గరుణచే = సోదరులను గూడికొనుచు - మోద మొప్పఁగ నీదు సేవఁ - బాదుకొనుచు నుందును నీ పాదపద్మములనుబట్టి ॥గొప్ప॥

- పులిపాక జగన్నాథము

## 61 సృష్టికర్త స్తుతి

రా - కాంభోజి తా - ఝంపె

ఘనుఁడైన యెహోవా - గద్దె ముందట మీరు - [1]వినతు లిప్పుడు చేయుఁడి - యోజనులార - వినయంబుగా నిర్మ - లానంద [2]రసలహరి - మన మనం బొప్పుచుండ - నో జనులార ॥ ఘనుఁడైన॥

---

[1]స్తోత్రములు. [2]అల